క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆయుర్ రక్షా ఆయుర్వేదిక్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆదివారం నగరంలోని 54వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేంద్ర ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మంజుల మాట్లాడగా.. కార్యక్రమంలో డాక్టర్ పి.పూజిత, నిర్వాహకులు రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


డీఈఓతో మాట్లాడుతున్న సైదులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పని చేస్తున్న ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్‌టీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం డీఈఓ సోమశేఖరశర్మను కలిసిన అనంతరం సైదులు మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో నిర్వహించే పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల టైం టేబుల్‌లో ఫిజిక్స్, బయోలాజికల్ సైన్స్‌లను రెండు రోజుల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, పలు సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబూబ్ అలీ, రాధాకృష్ణ, యాదగిరి, మన్సూర్, వెంకన్న, సుధాకర్, శ్రీను, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి


పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న సర్పంచ్ లూసీ

కామేపల్లి: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ జాయ్‌లూసీ అన్నారు. ఆదివారం గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టిన సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలో పరిశుభ్రతతో పాటుమౌలిక సదుపాయాలే ధ్యేయంగా పని చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

రఘునాథపాలెం: మండలంలోని పరికలబోడు తండాకు చెందిన శతాధిక వృద్ధుడు బానోత్ బిల్యానాయక్ ఇటీవల మృతి చెందగా.. ఆదివారం ఎంపీ నామా క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ కనకమేడల సత్యనారాయణ, పలువురు నాయకులు బిల్యానాయ క్ సంతాపం తెలిపి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ రఘునాథపాలెం మండల అధ్యక్షుడు అజ్మీరా వీరూనాయక్, జిల్లా టెలికాం సలహా మండలి సభ్యుడు చిత్తారు సింహాద్రియాదవ్, నామా సేవా సమితి నాయకుడు చీకటి రాంబాబు, సర్పంచులు రామ, అరుణ, నాయక్, అమర్‌సింగ్, మోతీలా ల్, ఉప సర్పంచ్ ఈరి పాల్గొన్నారు. కాగా, అదే గ్రామంలో మృతి చెందిన బానోత్ పార్వతి భౌతిక కాయాన్ని కూడా సందర్శించి నివాళర్పించారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	3
వంకాయ	18		20
బెండకాయ	46	పాలకూర	3
పచ్చిమిర్చి	46		20
కాకర	56	చుక్కకూర	3
బీర	46		20
దొండ	24	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	70	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	24	కొత్తిమీర	1
చామగడ్డ	64		30
క్యారెట్	30	పుదీన	1
క్యాప్సికం	56		20

-ఖమ్మం వ్యవసాయం

పాలన గాడిన పడేనా?

ప్రత్యేక పాలనకు అధికారుల కొరత..

- వచ్చే నెల 2న ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం
- ఒక్కో అధికారికి మూడు వరకు పంచాయతీలను అప్పగించే అవకాశం
- నాన్ గెజిటెడ్ అధికారి కూడా ప్రత్యేకాధికారే..
- కార్యదర్శుల కంటే పైహోదా ఉన్న వారికే ప్రాధాన్యం
- జాబితాను సిద్ధం చేసిన అధికారులు



నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయం

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు లేకపోవడంతో ప్రతీ పంచాయతీకి ప్రత్యేకాధికారులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందులో భాగంగా అన్ని మండలాల్లోని రికార్డు అసిస్టెంట్ నుంచి మొదలు మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్ సహా ఎంత మంది ఉన్నారనే వివరాలను జిల్లా ఉన్నతాధికారులు అడిగినట్లు తెలుస్తోంది. సర్పంచ్‌ల పదవీ కాలం వచ్చే నెల 2వ తేదీ నుంచి ముగియనున్న నేపథ్యాన ఈ నెలాఖరులోగా జాబితాను ఖరారు చేసి ఆమోదం తెలపాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములు లేని శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

అన్ని మండలాల్లోనూ కొరతే..

పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అధికారుల కొరత వేధిస్తూనే ఉంది. వ్యవసాయ శాఖ ఏఓతో పాటు ఏఈఓలు, మండల పరిషత్, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, పశు వైద్యులు, సంక్షేమ శాఖ, మిషన్ భగీరథ, నీటిపారుదల, విద్యారంగం, మండల కార్యాలయాలల్లో పని చేసే సూపరింటెండెంట్‌తో పాటు ఇతరులను తీసుకోవాల్సి ఉంటుంది.

పైహోదా ఉంటేనే అవకాశం..

కార్యదర్శుల కంటే పైహోదా ఉండే వారినే ప్రత్యేకాధికారులుగా నియమించాల్సి ఉంటుంది. మండలాల వారీగా ఎంతమంది సిబ్బంది ఉన్నారనే సమాచారాన్ని ప్రస్తుతం సేకరిస్తున్నట్లు తెలిసింది. మేజర్ పంచాయతీలకు జిల్లా అధికారులను నియమించాల్సి ఉంది. సిబ్బంది కొరత వలన ప్రతీ అధికారికి దాదాపు రెండు లేదా మూడు పంచాయతీలను ఇచ్చే విధంగా కార్యచరణను రూపొందించినట్లు సమాచారం. ఇలాంటి చోట్ల ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. అధికారుల కొరత వలన గెజిటెడ్ కానీ వారిని నాన్ గెజిటెడ్ ఏఎస్ఓ, ఆర్ఐలతో పాటు వివిధ శాఖలలో పని చేసే వారిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. వీరితో పంచాయతీలలో పాలన సక్రమంగా సాగేనా? అనే అనుమానులు వ్యక్తమవుతున్నాయి.

141 పంచాయతీలకు ప్రత్యేకాధికారులు..

సర్పంచ్‌ల పదవీ కాలం వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తున్న నేపథ్యాన ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సుముఖంగా కనిపించడం లేదు. దీంతో పాలేరు నియోజకవర్గంలోని మొత్తం 141 పంచాయతీలకు ప్రత్యేకాధికారులు రానున్నారు. ఈనేపథ్యాన పాలేరు డివిజన్‌లోని నేలకొండపల్లి మండలంలో 32 పంచాయతీలు, కూసుమంచిలో 41, ఖమ్మం రూరల్‌లో 28, తిరుమలాయపాలెం మండలంలో 40 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలకు వచ్చే నెల మూడు నుంచి ప్రత్యేకాధికారులు రానున్నారు. కాగా సర్పంచ్‌లు మాత్రం మండిపడుతున్నారు.

జాబితా పంపించాం..



మండలంలోని వివిధ శాఖలకు చెందిన నాన్ గెజిటెడ్ అధికారి నుంచి కూడా జాబితా తీసుకున్నాం. మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు సంబంధించిన జాబితాను పంపించాం. అధికారుల ఆదేశాల మేరకు అన్ని పంచాయతీలకు పంపించాం. మేము అంతా సిద్ధంగా ఉన్నాం.

– కె.జమలారెడ్డి, ఎంపీడీఓ, నేలకొండపల్లి

సర్పంచ్‌లకు అవకాశమివ్వాలి..



కరోనా సమయాన సర్పంచ్‌లు రెండేళ్ల పాటు పాలన కోల్పోయారు. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రావాల్సి ఉంది. కనీసం ఎన్నికల వరకైనా పర్సనల్ ఇన్‌చార్జ్‌లుగా అవకాశమివ్వాలి. నూతన ప్రభుత్వం సర్పంచ్‌ల గోడును ఆలకించాలి.

– గండు సతీశ్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు, నేలకొండపల్లి

ప్రభుత్వ నిర్ణయం మేరకే..



పంచాయతీ సర్పంచ్‌ల విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నాం. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలనే సర్పంచ్‌ల బిల్లులు నిలిచిపోయాయి. ఇందిరమ్మ రాజ్యంలో పాలన సంపూర్ణంగా సాగాలనే లక్ష్యంతో కార్యచరణను రూపొందిస్తున్నారు.

– బచ్చలకూరి నాగరాజు, కోర్లగూడెం

ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

ఖమ్మంమయూరిసెంటర్: నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఉద్యోగాల నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో డీవైఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయడాన్ని తమ సంఘం హర్షిస్తుందని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన తప్పిదాలను ఇప్పుడు జరగకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలో తక్షణమే మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, యంగ్ ఉమెన్ రాష్ట్ర కన్వీనర్ రోష్నీ ఖాన్, జిల్లా ఆఫీస్ బెరర్స్ చింతల రమేష్, శీలం వీరబాబు, సత్తెనపల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ప్రీమియర్ లీగ్ లోగో ఆవిష్కరణ


లోగో ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: ఫిబ్రవరి రెండో వారంలో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించన్ను ఖమ్మం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ లోగోను ఆదివారం స్టేడియంలో డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ టోర్నీపై రాష్ట్ర వ్యవసాయక శాఖమంత్రికి దృష్టికి తీసుకెళ్లి టోర్నీల తేదీలను ఖరారు చేస్తామని తెలిపారు. కార్పొరేటర్లు కమర్తపు మురళి, మిక్కిలినేని నరేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్, వేళ్ల రవి, డాక్టర్ రవి, ఆసీఫ్, నరేశ్, వెంకట్, మహేశ్, అశ్రిఫ్, శ్రీకాంత్, కరీంలు పాల్గొన్నారు.

గ్రామాల వారీగా సమీక్ష

నేలకొండపల్లి: ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ విధానాలను వివరించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముఖ్యులతో గ్రామాల వారీగా సమీక్ష చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వెనికె జానకిరామయ్య, శాఖమూరి రమేశ్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొర్లకుంట్ల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు కొడాలి గోవిందరావు, వెన్నపూసల సీతారాములు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పైనంపల్లిలో వివిధ పార్టీల నుంచి పలువురు బీజేపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాల పట్ల పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి చేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుకై ఉద్యమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోటి హనుమంతరావు, తొగాటి నాగచారీ, కందర బోయిన వెంకటరమణ, నాగేశ్వరరావు, కాశయ్య, దేవల తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ పదవిని యాదవులకు కేటాయించాలి


మాట్లాడుతున్న సంఘ నాయకులు

నేలకొండపల్లి: డీసీసీబీ చైర్మన్ పదవిని యాదవులకు కేటాయించాలని జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం, బీసీ సంఘాల ప్రతినిధులు మల్లే బోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 25 ఏళ్ల పాటు గొర్రెల పెంపకందారుల కోసం అనేక రూపాలలో సేవలు అందించిన నాయకుడు, డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్‌కు ఇవ్వాలని కోరారు. జిల్లాలో మూడు లక్షల ఓటు బ్యాంక్ ఉన్న యాదవులకు జిల్లా రాజకీయాలలో ఏనాడు పెద్ద పదవి ఇవ్వలేదని, యాదవులకు కేటాయించే దిశగా మంత్రులు ఆలోచించాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో సంఘం నాయకులు కనకబండి రమేశ్, మల్లే బోయిన ఉపేందర్, చిలకల లింగయ్య, మారుతి కోటి, నూక వెంకటేశ్వరరావు, చంద్రకాని మధు, బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్‌బీఐటీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి పరీక్ష నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐటీ అకాడమిక్ డైరెక్టర్ జి.ప్రవీణ్‌కుమార్ సంస్థ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో వివిధ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగిశెట్టి వెంకటేశ్వర్లు, కలకోట నరసింహారావు ఆధ్వర్యాన కాంగ్రెస్ పార్టీలో చేరగా.. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకులు మాదంశెట్టి హనుమంతరావు, చెరుకూరి ముత్తయ్య, మేళ్లచెరువు రాంప్రసాద్, చెరుకూరి సీతారాములు, మాదంశెట్టి సీతారాములు, అమరం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న కోలా సాగర్

ఖమ్మం మామిళ్లగూడెం: పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని సీలింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు కోలా సాగర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగాయి కాని తమ కూలీ రేట్లు మాత్రం పెరగడం లేదని ఆరోపించారు. గుర్తింపు కార్డులు కలిగిన వర్కర్లు కాంట్రాక్టు మేస్త్రీలతో మాత్రమే సీలింగ్ పనిని అగ్రిమెంట్ చేసుకోవాలని, ప్రతీ అడుగుకు రూ.18 నుంచి రూ.25 పెంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకై ఫిబ్రవరి 1 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షుడు ప్రసాద్‌మోరియా, నందాలాల్, శివకుమార్, గుండా శ్రీనివాస్‌రెడ్డి, సమీర్, రామ్, సాజన్, ప్రియారమేశ్, శివ, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల విస్తృత పర్యటన


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత క్యాంపు ఆఫీస్‌లో కుమ్మరి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. తర్వాత హరిత గార్డెన్‌లో శ్రేష్ఠ ఆస్పత్రి అధినేత డాక్టర్ కిలారు సునీల్, చంద్రిక దంపతుల కుమారుడి బారసాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే త్రీటౌన్‌లో ఇటీవల మరణించిన మూసా పద్మావతి, తేరాల రామారావు దశదిన కర్మలతో పాటు ప్రకాశ్‌నగర్ మామిడితోటలో జిల్లా పెరిక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో, ప్రముఖ వ్యాపారస్తుడు బాదే రవికుమార్ నివాసంలో లంచ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, చావా నారాయణరావు, రావూరి సైదుబాబు, మిక్కిలినేని నరేందర్, నల్లమల ఆనంద్, గజ్జెల లక్ష్మీ వెంకన్న, తల్లాడ రమేశ్, కల్వకుంట్ల గోపాల్‌రావు, బొమ్మ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ ..

ఖమ్మం మామిళ్లగూడెం: శ్రీ మొల్లమాంబ కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు కుదారపు సూరిబాబు ఆధ్వర్యాన నూతన సంవత్సర క్యాలెండర్ 2024ను ఆదివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దరిపల్లి చంద్రశేఖర్, కోశాధికారి చలిగంటి భిక్షం, ఉపాధ్యక్షులు మొగిలిచర్ల సైదులు, మల్లెల రాధాకృష్ణ, సలివేరు బుచ్చిరాములు, చంటి, సోమలపల్లి శ్రీనివాస్, కొత్తపల్లి నర్సయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో సమాజ చైతన్యం


అక్షరాల తోవ వార్షికోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఖమ్మంవ్యవసాయం: సమాజాన్ని మార్చగలిగే శక్తి సాహిత్యానికి ఉందని పలువురు సాహితీవేత్తలు స్పష్టం చేశారు. అక్షరాల తోవ 6వ వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం నగరంలోని రిక్కాబజార్ హైస్కూల్‌లో నామా పురుషోత్తం అధ్యక్షతన జరిగింది. ఈ సభలో వక్తలు మాట్లాడుతూ.. సాహితీవేత్తలు నిత్యం సమాజంలో జరుగుతున్న సంఘటనలను కవులు, రచయితలు తమ సాహిత్యం ద్వారా వివరిస్తూ చైతన్య పరుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కథలు, కవితలతో ప్రచురించిన వార్షికోత్సవ సంచికను కవులు, విద్యావేత్తలు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కథల పోటీల్లో విజేతలుగా నిలిచిన బి.కళాగోపాల్(నిజామాబాద్), బీ.వీ.శివప్రసాద్(విజయవాడ), పత్తూరి సీరామారాజు(కాకినాడులకు నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ కార్యక్రమంలో కవి మువ్వా శ్రీనివాసరావు, వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వురిమళ్ల సునంద, రౌతు రవి, రాచమళ్ల ఉపేందర్ సయ్యద్ షఫీ, కన్నెగంటి వెంకటయ్య, కొమ్మవరపు కృష్ణయ్య, మేడగాని శేషగిరి, తోట సుబాషిణి, ఇబ్రహిం, యలమద్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొనగా, కార్యక్రమంలో కమేడియన్ మొగిలి గుణకర్ హాస్యవల్లరి కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: పెన్షనర్ల పెండింగ్ సమస్యలన్నింటిని పరిష్కరించాలని గెజిటెడ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు ఏలూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఖమ్మంలోని కేఎండీసీ కళాశాలలో తెలంగాణ సంక్షేమ శాఖల విశ్రాంతి అధికారులు, వసతిగృహ సంక్షేమ అధికారుల అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం కె.సీతారాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సంక్షేమ శాఖల విశ్రాంతి ఉద్యోగులు, అధికారుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. వారి ఆరోగ్య సంరక్షణకు హెల్త్‌కార్డు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం సీతారాములు రచించిన సంక్షోభంలో సంక్షేమ బాట పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.పిచ్చిరెడ్డి, మహిళా సంఘం ప్రతినిధి వెంకటనరసమ్మ, నాయకులు గంగయ్య, సుదర్శన్, జయరాజు, సాంబయ్య, పంజాబ్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం


సీనియర్ పెన్షనర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఏర్పడి 47 వసంతాలు పూర్తయిన సందర్భంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య తెలిపారు. ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించగా డీఈఓ సోమశేఖర శర్మ, ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ తదితరులు హాజరై సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్నామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఖమ్మం డిపో నూతన కమిటీని ఆదివారం ఖమ్మం మంచికంటి మీటింగ్ హాల్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పగిళ్లపల్లి నరసింహారావు, జి.రోశయ్య, ఉపాధ్యక్షులుగా సరిపురపు సీతారామయ్య, గుర్రం రామారావు, కోశాధికారిగా సరితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు గడ్డం లింగమూర్తి, తోకల బాబు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రంశెట్టి వెంకటేశ్వర్లు, బసవయ్య, గుండు మాధవరావు, సుధాకర్, పర్వీనా, రామారావు, రవి, కిరణ్, ఎండీ.పర్వీజ్, శ్రీను, ముత్తయ్య, వీరయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్ఐకి వీడ్కోలు


ఎస్ఐకి వీడ్కోలు పలుకుతున్న సీఐ, సిబ్బంది

రఘునాథపాలెం: రఘునాథపాలెం ఎస్ఐగా విధులు నిర్వహించి బదిలీపై తల్లాడ వెళ్తున్న ఎస్ఐ కొండలరావుకు ఆదివారం రాత్రి రఘునాథపాలెం స్టేషన్‌లో వీడ్కోలు పలికారు. సీఐ శ్రీధర్ ఆధ్వర్యాన ఎస్ఐను సన్మానించి బదిలీ ప్రాంతంలో కూడా ఇదే తీరుగా ప్రజల మన్ననలను పొందాలని ఆకాంక్షించారు.

మళ్లీ మొదలు పెట్టారు..!

- డబుల్ బెడ్రూం సముదాయంలో సొంత కట్టడాలు..
- నెలకొంటున్న ఘర్షణలు


ద్వారబంధం బిగిస్తున్న కూలీలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్ వైఎస్సార్ నగర్ కాలనీలోని డబుల్ బెడ్రూం సముదాయంలో లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా తమ ఇష్టానుసారంగా కట్టడాలను తొలగించి ద్వారబంధం, కిటికీలు పెట్టుకుంటున్నారు. దీంతో నివాసుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో కొంతమంది కింద ఉన్న లబ్ధిదారులు తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇంటిని వ్యాపారం కోసం వినియోగించే ప్రయత్నం చేయగా.. కొంతమంది ఫిర్యాదులు చేయడంతో వాటిని తొలిగించారు. తాజాగా తలుపు, కిటికీలు పెట్టడం మళ్లీ మొదలు పెట్టారు. అంతేకాక అందరికీ ఉపయోగపడే ఖాళీ స్థలంలో మొత్తలను ఏర్పాటు చేస్తూ తమకు అనుకూలంగా మార్చుకుంటుండడంతో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి.

ఒకరిని చూసి మరొకరు..

లబ్ధిదారులకు కేటాయించిన ఇంటి పట్టా స్థలాన్ని మాత్రమే వాడుకోవాలే తప్ప ఇతర నిర్మాణాలు చేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ 2, 5, 6, 10 బ్లాకుల పరిధిలో నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదులు నెలకొన్నాయి.ఇదేమిటని ప్రశ్నిస్తే గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఇలా ఒకరిని చూసి మరొకరు కట్టడాలు చేస్తున్నారని, ఇలానే నిర్మాణాలు కొనసాగితే అక్కడ శాంతి భద్రతల విషయంలో సమస్య వచ్చే అవకాశం ఉంటుందని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని నివాసులు కోరుతున్నారు.కాగా, ఈవిషయంపై కార్పొరేటర్ లకావత్ సైదులును వివరణ కోరగా.. నిర్మాణాలు చేస్తున్నట్లు కొంతమంది తన దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.